క్లుప్తంగా

సీపీఐ నాయకుడికి ఎమ్మెల్సీ పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సత్యం

మద్దిరాల : మండల పరిధిలోని ముకుందాపురం గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ మూరగుండ్ల లక్ష్మయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం శనివారం ఆయనను పరామర్శించారు. ఆరోగ్య సమాచారం అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్న చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లావుల రాములు, మండవ వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు, తొట్ల ప్రభాకర్, అనంతుల మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

6న కంటి వైద్యశిబిరం

భానుపురి : రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో ఈ నెల 6న వరంగల్‌కు చెందిన శరత్ లేజర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండ శ్యాంసుందర్‌రెడ్డి, సుధగాని నాగేశ్వరరావు శనివా రం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహించే వైద్య పరీక్షలకు పెన్షనర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆరోగ్యశ్రీ కార్డుదారులు, జర్నలిస్టులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరీక్షల అనంతరం ఎవరికైనా ఆపరేషన్లు అవసరమైతే ఉచితంగానే చేయనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాద మృతులకు నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం మాలిపురం గ్రామానికి చెందిన అన్నదమ్ములు వేముల నాగరాజు, వేముల కార్తీక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులను శనివారం ఎమ్మెల్యే మందుల సామేల్ పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, పట్టణ శాఖ అధ్యక్షుడు వీరేష్, డానియల్, రాములు, సుధాకర్ పాల్గొన్నారు.

పిడుగుపాటుతో గేదె మృతి

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల కేంద్రం వాసి మాదగాని మధుసూదన్‌కు చెందిన రూ.80వేల విలువ చేసే పాడి గేదె శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి పిడుగు పడి మృతి చెందింది. అదేవిధంగా అర్వపల్లిలో తుంగతుర్తి రోడ్డు నందు విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ సమీపంలో విద్యుత్ వైర్లు తగిలి మనుబోతుల లింగయ్యకు చెందిన 3 మేకలు విద్యుధాఘాతంతో మృతి చెందాయి. దీంతో సుమారు రూ.40వేల నష్టం వాటిల్లింది. మేకలు కాస్తున్న యజమాని లింగయ్యకు కూడా విద్యుధాఘాతంతో స్వల్ప గాయాలయ్యాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

కుంటపల్లిలో గొర్రెలు..

మద్దిరాల : కుంటపల్లిలో శనివారం పిడుగు పడి గేదె మృతిచెందింది. స్థానికులు తెలిపిన ప్రకారం.. కుంటపల్లి గ్రామానికి చెందిన బత్తిని సైదులు తన గేదెను మేత కోసం చేను వద్దకు తీసుకెళ్లి కట్టేశాడు. గేదె మేత మేస్తుండగా వర్షంతో పాటు పిడుగు పడడంతో అక్కడిక్కడే మృతిచెందింది. రూ.లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మరుజన్మకు మరో అవకాశం అవయవదానం



అంగీకార పత్రం అందజేస్తున్న దాత

సూర్యాపేట : మరుజన్మకు మరో అవకాశం అవయవదానం అని స్పందన శరీర అవయవదాన సంస్థ నిర్వాహకులు తెలిపారు. శనివారం సూర్యాపేటకు చెందిన విశ్రాంత బ్యాంకు మేనేజర్ యానాల యాదగిరి రెడ్డి, మల్లీశ్వరి దంపతులు అవయవదాన అంగీకార పత్రాన్ని స్పందన సంస్థకు అందజేశారు. ఈ సందర్భంగా స్పందన అవయవదాన సంస్థ గౌరవాధ్యక్షుడు, సామాజికవేత్త గుండా రమేష్, అధ్యక్ష, కార్యదర్శులు జి.రమేష్, మిట్టకోల కోటయ్య మాట్లాడుతూ వారిని అభినందించారు.

ఆర్థికసాయం అందజేత

మోతె : మండల పరిధిలోని రావిపహాడ్ గ్రామంలో చాట్ల శైలజ ఇటీవల మృతిచెందింది. శనివారం రావిపహాడ్ అంబేడ్కర్ చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.39వేల ఆర్థికసాయం, రెండు క్వింటాళ్ల బియ్యం అందజేశారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- జాజిరెడ్డిగూడెం మండలానికి 348 ఇళ్లు మంజూరు
- 270 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం
- ఇసుక కొరతతో పనులకు కొంత ఆటంకం



ఉయ్యాలవాడలో నిర్మాణంలో ఉన్న ఇల్లు

అర్వపల్లి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. జాజిరెడ్డిగూడెం మండలానికి పైలట్ ప్రాజెక్టుతో పాటు మొదటి విడతలో 348 ఇళ్లు మంజూరయ్యాయి. అయితే పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన ఉయ్యాలవాడలో 110 ఇళ్లు మంజూరు కాగా మిగిలినవి మొదటి విడతలో మంజూరయ్యాయి. ఉయ్యాలవాడలో మొదటి విడతలో మంజూరైన 110 ఇళ్లకు గానూ ఇప్పటికే 80 ఇళ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మిగిలిన ఇళ్ల పనులు మొదలు కావాల్సి ఉంది.

గ్రామాల్లో ఇళ్ల మంజూరు ఇలా..

అడివెంలకు 21, అర్వపల్లికి 1, బొల్లంపల్లికి 8, జాజిరెడ్డిగూడేనికి 57, కాసర్లపహాడ్‌కు 23, కోడూరుకు 14, కోమటిపల్లికి 5, కుంచమర్తికి 6, లోయపల్లికి 10, నాన్యతండాకు 4, పర్సాయపల్లికి 17, రామన్నగూడేనికి 25, సూర్యానాయక్‌తండాకు 10, తిమ్మాపురం గ్రామానికి 31, వేల్పుచర్లకు 6 చొప్పున ఇళ్లు మంజూరయ్యాయి. కాగా కొమ్మాలకు మాత్రం ఇళ్ల మంజూరు ఆగిపోయింది. వీటిలో తిమ్మాపురంలో ఇళ్ల నిర్మాణ పనులు మొదలు కావాల్సి ఉంది. పర్సాయపల్లి, కాసర్లపహాడ్, రామన్నగూడెం తదితర గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ పనులు ఊపందుకోవాల్సి ఉంది. కాగా ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తోంది. అయితే నెల రోజుల నుంచి మూసీనదిలో వరదల మూలంగా తుంగగూడెం, పేరబోయినగూడెం రెండు ఇసుక రీచ్‌లలో రోడ్లు కొట్టుకపోయి ఇసుక సరఫరా నిలిచిపోయింది. దీంతో ఇసుక లేక ఇళ్ల నిర్మాణాలకు ఆటంకం కలుగుతోంది. మండల అధికారులు ఎప్పటికప్పుడు ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తూ వేగంగా పనులు జరిగేలా చర్యలు చేపడుతున్నారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల కోడ్‌తో ఇప్పటి వరకు మొదలు కాని ఇళ్ల పనులకు బ్రేక్ పడింది.

పనులు జరుగుతున్నాయి



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు మండలంలో ముమ్మరంగా జరుగుతున్నాయి. 270కి పైగానే ఇళ్ల నిర్మాణ పనులు నడుస్తున్నాయి. బిల్లులు కూడా తొందరగా వచ్చేలా చూస్తున్నాం. పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. మొదలు కాని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఎన్నికల కోడ్ ఎత్తివేశాక ప్రారంభించాలి.

– టి.గోపి, ఎంపీడీఓ

దుర్గామాత శోభాయాత్ర, నిమజ్జనం



తిరుమలగిరి : శోభాయాత్రలో ట్రాక్టర్ నడుపుతున్న మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్



నాగారం : మాచిరెడ్డిపల్లి గ్రామంలో దుర్గామాత విగ్రహాలను శోభాయాత్రగా తీసుకెళ్తున్న భక్తులు

తిరుమలగిరి : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పాత గ్రామంలో అమ్మవారి శోభాయాత్రను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శోభాయాత్ర ట్రాక్టర్‌ను నడిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రఘునందన్‌రెడ్డి, నరోత్తమ్‌రెడ్డి, బాబు, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్, తిరుమలేష్, రామ్మూర్తి గౌడ్, జయచందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత శోభాయాత్రలు, నిమజ్జనం

అర్వపల్లి : దేవీ నవరాత్రోత్సవాలలో భాగంగా శనివారం మండల పరిధిలోని కోడూరు, జాజిరెడ్డిగూడెం, అర్వపల్లి తదితర గ్రామాల్లో దుర్గామాత శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

నాగారం : మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి, ఫణిగిరి, పసునూర్, పస్తాల, ఈటూరు తదితర గ్రామాల్లో శనివారం దుర్గామాత శోభాయాత్రను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. దుర్గామాత విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆయా గ్రామాలలోని చెరువులలో నిమజ్జనం చేశారు.



అర్వపల్లి : కోడూరులో దుర్గామాత శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

జీఎస్టీ సంస్కరణలతో రైతులకు మేలు



ట్రాక్టర్ షోరూంలో రైతులతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్య గౌడ్

తిరుమలగిరి : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలతో రైతులకు, చిరు వ్యాపారులకు, యువతకు ఎంతో మేలు జరుగుతుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్య గౌడ్ అన్నారు. శనివారం తిరుమలగిరిలోని ట్రాక్టర్ షోరూంలో రైతులతో మాట్లాడారు. జీఎస్టీ సంస్కరణలతో ఆర్థిక రంగం బలోపేతం అవుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని, చిరు వ్యాపారులకు ఎంతో మేలు చేస్తోందని అన్నారు. సాధారణ పౌరులపై భారం తగ్గుతుందని తెలిపారు. రైతులకు, వ్యవసాయ యంత్ర పరికరాలు, ఇతర వస్తువులపై గతంలో 12 శాతం ఉన్న జీఎస్టీ 5 శాతానికి తగ్గించడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య, మన్మథరెడ్డి, కడియం కళ్యాణ్, దండ శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, దీన్‌దయాళ్, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో అభివృద్ధి పనులు



నూతనంగా నిర్మించిన హనుమాన్ మండపం



నిర్మాణంలో ఉన్న తిరుకల్యాణ మండపం

- అర్వపల్లి ఆలయానికి రూ.25లక్షలు అందజేసిన దాతలు
- ప్రభుత్వ నిధులతో మరికొన్ని పనులకు ప్రతిపాదనలు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో దాతల సహకారంతో అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయి. గతంలో రూ.కోటితో ఆలయ పునర్నిర్మాణంతో పాటు వివిధ పనులు చేపట్టారు. ప్రస్తుతం దాతల సహకారంతో మరికొన్ని పనులు జరుగుతున్నాయి. మరికొన్ని పనుల నిర్మాణానికి ప్రభుత్వ నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపారు.

రూ.25లక్షలతో వివిధ నిర్మాణాలు..

దేవాలయం ఎదుట హైదరాబాద్‌కు చెందిన దాత రుద్రంగి కిరణ్‌కుమార్ సుమారు రూ.10 లక్షలతో హనుమాన్ ఆలయం, హనుమాన్ మండపం నిర్మిస్తున్నారు. అలాగే ఎన్‌ఆర్‌ఐలు డాక్టర్ యోగానంద్, డాక్టర్ నర్సింహారావు సోదరులు రూ.15లక్షలతో తిరుకల్యాణ మండప నిర్మాణం చేపడుతున్నారు. వీటి పనులు చివరి దశకు చేరాయి. యాగశాల మరమ్మతు పనులను కూడా చేపట్టుటకు దాత ముందుకు వచ్చారు. పనులు మొదలు కావాల్సి ఉంది.

పలు నిర్మాణాలకు ప్రతిపాదనలు..

దేవాలయానికి చుట్టూ ప్రహరీ నిర్మాణంతో పాటు ఆలయంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టుటకు నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపారు. ఈ నిధులు మంజూరైతే ఆ పనులు చేపట్టనున్నారు.

దాతలు ముందుకు రావాలి



జిల్లాలోనే ప్రసిద్ధ, పురాతన దేవాలయమైన అర్వపల్లి ఆలయ అభివృద్ధికి మరింత మంది దాతలు ముందుకు రావాలి. ఇప్పటికే దాతల సహకారంతో రూ.25లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. మరికొన్ని పనులు చేపట్టుటకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

– అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, దేవస్థాన చైర్మన్

బంగారు గొలుసు చోరీ

సూర్యాపేటటౌన్ : తాళం వేసి ఉన్న ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తి చొరబడి బంగారు గొలుసు చోరీ చేశాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విజయకాలనీలో నివాసముంటున్న సయ్యద్ జుబేద జాస్మిన్ సెప్టెంబర్ 28న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల పెళ్లికి వెళ్లింది. పెళ్లి అయిపోయాక శుక్రవారం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో దాచిన రెండు తులాల బంగారు గొలుసు కనిపించలేదు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా.. పట్టణ పోలీసులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శివతేజ తెలిపారు.

సమాచారం అందించాలి

అర్వపల్లి : సమాచార హక్కు చట్టం ప్రకారం దరఖాస్తుదారులకు నిబంధనల మేరకు సమాచారం అందించాలని ఎంపీడీఓ గోపి కోరారు. ఆదివారం నుంచి ఈ నెల 12 వరకు జరిగే సమాచార హక్కు చట్టం వారోత్సవాల విజయవంతానికై శనివారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సూపరింటెండెంట్ రామకృష్ణ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కాసర్లపహాడ్‌లో గురువులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కాసర్లపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2014–15 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోటమర్తి వీరయ్య, ఎస్‌కె.అమీనాబేగం, సీహెచ్.మురళీకృష్ణ, పూర్వ విద్యార్థులు నవీన్, దయాకర్, విజయ్, శివాజీ, నాగార్జున్, సురేష్, కిరణ్, శ్రీకాంత్, గణేష్, దివ్య, భార్గవి, అఖిల, శిరీష, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని వినతి



అర్వపల్లిలో తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో అదనంగా మరో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. తిమ్మాపురం క్రాస్‌రోడ్డు, జ్యోతులనగర్ గ్రామాల ప్రజలు 3కి.మీ దూరంలోని తిమ్మాపురం గ్రామానికి బియ్యం కోసం నడిచి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. దీంతో ప్రతినెలా ఎన్నో వ్య య ప్రయాసలకు గురికావాల్సి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కూర శంకర్, బింగి రవి, బూర్గుల రాంబాబు, వేముల సత్తయ్య, కోనేటి రవి, శ్రీకాంత్, రవీందర్ రెడ్డి, గోవర్ధన్, నాయకులు పాల్గొన్నారు.

దామోదర్ రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు



అర్వపల్లి : కొమ్మాలలో దామోదర్ రెడ్డి ఫ్లెక్సీకి నివాళులర్పిస్తున్న నాయకులు



అర్వపల్లి : తిమ్మాపురంలో నివాళులర్పిస్తున్న నాయకులు



నాగారం : మాచిరెడ్డిపల్లిలో..



తిరుమలగిరిలో నివాళులర్పిస్తున్న నాయకులు



తిరుమలగిరి : బండ్లపల్లిలో..

తిరుమలగిరి : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి, ఉమ్మడి జిల్లా ప్రజలకు తీరని లోటని రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుడు సంకెపల్లి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం తిరుమలగిరి క్రాస్ రోడ్డులో దామోదర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సంకెపల్లి కొండల్ రెడ్డి, ఎండీ.ఖలీమ్, విన్సెంట్, మల్లారెడ్డి, సుధాకర్, లింగయ్య, కిష్టు నాయక్, నర్సింహ పాల్గొన్నారు.

బండ్లపల్లి గ్రామంలో..

బండ్లపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దామోదర్ రెడ్డి చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బర్మ సోమనర్సయ్య, నాగరాజు, బాలకృష్ణ, అజీమొద్దిన్, సత్తయ్య, నర్సింహ స్వామి, రాజు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి శనివారం ఊరూరా కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఇందుర్తి సీతారాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ అవిలయ్య, మాజీ సర్పంచ్ శశిరేఖ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వాసుదేవ రెడ్డి, మాజీ ఎంపీపీ మల్లేష్, వేములకొండ ఉప్పలయ్య, శ్రీధర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నాగారం : మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి, డి.కొత్తపల్లి, నాగారం, శాంతినగర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం మాజీ మంత్రి దామోదర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాంతినగర్ గ్రామంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పసుపులేటి వెంకట్‌రెడ్డి, మాద ముత్తయ్య, సోమిరెడ్డి, శీల కృష్ణమూర్తి, లింగమల్లు, వీరయ్య, నాతి శ్రీను, శీల రవీందర్, నాతి మధు, వడ్డె యాదగిరి, జేరిపోతుల సంపత్, ఎస్‌కే హుస్సేన్, పొదిల లింగయ్య, షేక్.జానీ, మల్లేపాక ప్రవీణ్, నాగుల్ మీరా, పొదిల ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి : పర్సాయపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు



నాగారం : శాంతినగర్‌లో కొవ్వొత్తులతో నివాళులు..

నెరవేరని చివరి కోరిక..

తుంగతుర్తి : మాజీమంత్రి దామోదర్‌రెడ్డి ఏడాది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలో ఆయన కుమారుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి అన్నీ తానై దగ్గరుండి సపర్యలు చేశారు. హైదరాబాద్‌లో దామోదర్‌రెడ్డికి చికిత్స జరిగే సమయంలో, తుంగతుర్తిలోని తన స్వగృహంలో తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటూ దగ్గరుండి చూసుకున్నాడు. నిత్యం అరోగ్య పరిస్థితిని సమీక్షిస్తూ వైద్యపరీక్షలు చేయించడం, తుంగతుర్తిలో నిత్యం ఆయన వెంట ఉంటూ భరోసా కల్పించడం వంటి కార్యక్రమాలు చేశారు. తండ్రి చివరి క్షణాల వరకు ఆయనకు తోడుగా ఉన్నారు. తండ్రి మృతితో ఆయన కన్నీటిపర్యాంతమయ్యాడు. దామోదర్‌రెడ్డి గత 2014, 2019 పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి నుంచి తన కుమారుడికి ఎంపీ టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. కానీ టికెట్ రాకపోవడంతో ఆయన నిరాశకు గురయ్యారు. ఎలాగైనా తన కుమారుడిని ఏదో ఒక పదవిలో చూడాలన్న ఆర్డీఆర్ చివరి కోరిక తీరలేదు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

మోతె : సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కొరకు ప్రతి కార్యకర్త కృషిచేయాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పలు పార్టీల నాయకులకు బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శీలం సైదులు తదితరులు పాల్గొన్నారు.

దామన్నా.. ఇక సెలవు



తుంగతుర్తిలో మాజీ మంత్రి దామోదర్ రెడ్డిని కడసారి చూసేందుకు తరలివచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు



దామోదర్ రెడ్డి అంత్యక్రియల వద్ద టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్, మంత్రి లక్ష్మణ్, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, తదితరులు



పార్థివదేహం వద్ద సర్వోత్తమ్ రెడ్డి, రోదిస్తున్న ఆర్డీఆర్ మనవడు



నివాళులర్పిస్తున్న ఎంపీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యేలు సామేల్, బీఎల్ఆర్, వీరేశం



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, సామేల్, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న



దామోదర్ రెడ్డి చితి..